క్లుప్తంగా

ప్రభుత్వ భూమిలో వేసిన గుడిసెల తొలగింపు



దామెర : మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామంలోని ముస్త్యాలపల్లి శివారులో సర్వే నెంబర్ 427లో ఎంసీపీఐ(యూ)కు చెందిన కొందరు వేసిన గుడిసెలను సర్పంచ్ బింగి రాజేందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేందర్ మాట్లాడారు. సదరు ప్రభుత్వ భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. ఆ స్థలంలో గుడిసెలు వేయొద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాడి మల్లయ్య, దాడి భిక్షపతి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మొరం అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు నుంచి రోడ్డు పనుల పేరుతో అక్రమంగా మొరం తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని కటాక్షపూర్ చెరువు వద్ద మొరం తవ్వకాలను ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇకనైనా అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, ఓబీసీ నాయకులు చిమ్మని దేవరాజు, బయ్య తిరుపతి, మాజీ సర్పంచ్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి 'ఇఫ్తార్' ప్రతీక



శాయంపేట : ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని టీపీసీసీ సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మదీనా మసీదులో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడారు. ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారని తెలిపారు. హిందూ ముస్లిములు ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు దూదిపాల బుచ్చిరెడ్డి, చిందం రవి, మారంపల్లి రవీందర్, రఫీ, మార్కండేయ, అంకుషావలీ, సర్వర్, రాజ్ మహమ్మద్, నసీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరితకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బోటనీ విభాగం పరిశోధకురాలు, హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కొమ్మిడి సరితకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. స్లాండ రెజైషన్ ఇన్ విట్రో టెక్నిక్స్ అండ్ జెనిటిఫ్ ఫైడెలిటీ ఆఫ్ కెట్రోస్టిస్ పోర్షెట్ డిస్సిమా (జాకో) కాగ్న – యాన్ ఇంపార్టెంట్ మెడిసినల్ క్లయింబర్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కొమ్మిడి సరితకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. బోటనీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎండీ.ముస్తఫా పర్యవేక్షణలో సరిత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

రంజిత్‌కుమార్‌కు 'దళితరత్న'

కాజీపేట: దళితరత్న అవార్డును కాజీపేట పట్టణానికి చెందిన 63వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బెదరకోట రంజిత్‌కుమార్ అందుకున్నారు. దళితుల అభివృద్ధికి రంజిత్ కుమార్ చేస్తున్న సేవలను గుర్తించి అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర మోచి కులసంఘం నాయకులు రవీంద్రభారతిలో ఆయనకు అవార్డు ప్రదానం చేశారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ల డైరెక్టరీ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ల సంఘం రూపొందించిన 2023 నూతన సంవత్సర డైరెక్టరీని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డైరెక్టరీలో పలు వివరాలు ఉన్నాయని తెలిపారు. డైరెక్టరీలోని సమాచారం విశ్రాంత అధ్యాపకులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు వినియోగించుకోవాలని కోరారు. అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, కేయూ విశ్రాంత అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సదానందం, జనరల్ సెక్రటరీ రవీందర్, కోశాధికారి వీరన్న పాల్గొన్నారు.

యువతను మోసగిస్తూ బీఆర్ఎస్ పాలన

● బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

పరకాల : సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం యువజనాన్ని మోసగిస్తూ పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి విమర్శించారు. హనుమకొండలో తలపెట్టిన నిరుద్యోగ మార్చ్‌కు బయల్దేరిన పార్టీ శ్రేణుల ర్యాలీని శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియమకాలే లక్ష్యంగా వందలాది మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబం స్వార్థ పూరిత పాలన సాగిస్తోందని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్ ప్రశ్నాపత్రాల లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, నిరుద్యోగ యువతకు వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ మాట్లాడారు. బీఆర్ఎస్‌కు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు యువత సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, కార్యదర్శి ఎర్ర రామన్న, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణచారి, కొలనుపాక భద్రయ్య, నాయకులు దుబాసి వెంకటస్వామి, గాజుల నిరంజన్, కుక్కల విజయ్, సంఘు పురుషోత్తం, ఆకుల రాంబాబు, పాలకుర్తి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పరకాల : ర్యాలీని ప్రారంభిస్తున్న భిక్షపతి



దామెర : ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి

టీఎస్‌పీఎస్సీ నిరుద్యోగుల పాలిట శాపం

దామెర : టీఎస్‌పీఎస్సీ నిరుద్యోగుల పాలిట శాపంగా పరిణమించిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలో తలపెట్టిన నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి మండల కేంద్రం నుంచి బీజేపీ శ్రేణులు చేపట్టిన పాదయాత్రను ప్రేమేందర్‌రెడ్డితోపాటు రాష్ట్ర నాయకులు మొలుగూరి భిక్షపతి, విజయ్‌చందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ప్రశ్నపత్రాల లీకేజీలతో విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరాంరెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు గన్ను సతీష్, వేల్పుల రాజ్‌కుమార్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పిట్టల రమేష్, ముత్యాల రాజశేఖర్, మేరుగు శ్రీను, దామెరుప్పుల దేవేందర్, నాగరాజు, ఎక్కలదేవి రమేష్, సండెపోరి సంతోష్ పాల్గొన్నారు.



శాయంపేట : ర్యాలీని ప్రారంభిస్తున్న ఉప్పు రాజు

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

శాయంపేట : నిరుద్యోగుల పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా కార్యదర్శి ఉప్పు రాజు అన్నారు. హనుమకొండలో తలపెట్టిన నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టగా రాజు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసగిస్తోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు యువత తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, చంద్రమౌళి, నవీన్, రాజశేఖర్, రాకేష్‌రెడ్డి, నాగరాజు, చంటి, రంజిత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం ధ్యేయం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. హనుమకొండలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది జనవరిలో పంట నష్టపోయిన రైతులకు మరో మూడ్రోజుల్లో పరిహారం చెక్కులు అందనున్నాయని తెలిపారు. రైతులను ఆదుకునేలా సీఎం కేసీఆర్ నిరంతరం పాటుపడుతున్నారని చెప్పారు. గత పాలకులు రైతులను ఏనాడూ ఆదుకోలేదని గుర్తు చేశారు. స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతుల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా నిలవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

'గెల్లు'కు శుభాకాంక్షలు...

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

కమలాపూర్ : బీజేపీ ఆధ్వర్యంలో హనుమకొండలో తలపెట్టిన నిరుద్యోగ మార్చ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు నివారించేందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్ తెలిపారు. నిరుద్యోగ మార్చ్‌కు వెళ్లకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మండలానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులను పోలీసులు శనివారం ముందస్తుగా అరెస్ట్ చేసి తదనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులైన ఇనుగాల రవీందర్, జక్కుల మహంకాళి, ఇనుగాల రత్నాకర్ తోపాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్, యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పోడేటి భిక్షపతి, నాయకుడు కొండపాక మనీష్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు బోయిని హనుమాన్ ప్రసాద్‌లను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సంజీవ్

కుటీర పరిశ్రమలతో మహిళల అభివృద్ధి

● నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్

కమలాపూర్ : కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా మహిళలు అభివృద్ధి చెందుతారని నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) ఎల్.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని ఉప్పల్ గ్రామంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల జీవనోపాధి, వ్యాపార అభివృద్ధి సంస్థ సహకారంతో టమాటా, చిల్లీ, తదితర ఆహార పదార్థాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌పై 90 మంది ఔత్సాహిక మహిళలకు ఏర్పాటు చేసిన 15 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా సాస్, చిల్లీ సాస్, చిరుధాన్యాలతో బిస్కట్ల తయారీ, మాంసపు పచ్చళ్లు వంటి వాటికి మంచి గిరాకీ ఉందన్నారు. మహిళలు ఆహార పదార్థాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌లో నైపుణ్యం పెంపొందించుకుని కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని చెప్పారు. శిక్షణలో భాగంగా మహిళలకు మార్కెటింగ్ మెళకువలు, ఫుడ్ ప్రాసెసింగ్ లైసెన్స్, బ్రాండింగ్, ప్యాకేజింగ్ అంశాలు నేర్పిస్తారని తెలిపారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్‌లో కుటీర పరిశ్రమల ఏర్పాటుకు పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం ద్వారా మహిళలకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం స్థానిక బ్యాంకును సంప్రదిస్తే రుణం పొందే అవకాశం ఉందన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గిర్మోజీ నాయక్ మాట్లాడుతూ బ్యాంకు నుంచి రుణాలకు సంబంధించి సహకరిస్తానని తెలిపారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధే సంస్థ ధ్యేయమని చెప్పారు. శిక్షణ అనంతరం మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ ట్రైనర్ సరోజన పచ్చళ్ల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్వోదయ సంస్థ సిబ్బంది కవిరాజ్, రవీందర్, అక్తర్, శ్రీలత, తిరుమల, రాధ, హైమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్

మహా కుంభాభిషేక వార్షికోత్సవం



ఐనవోలు : ప్రముఖ శైవ క్షేత్రమైన ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో శనివారంప్రాసాద పునరావర్తన మహా కుంభాభిషేక వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచకం, మండప ఆరాధన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. గతేడాది కోమాండ్లపెల్లి సంపత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రాసాద పునరావర్తన మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించగా పలువురు పీఠాధిపతులు హాజరైన విషయం విదితమే. కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

కాన్‌స్టిట్యూషనల్ మార్చ్‌ను విజయవంతం చేయండి

నయీంనగర్: పాత పెన్షన్ సాధనకు నేడు (ఆదివారం) వరంగల్ ఎంజీఎం కూడలి నుంచి ఏకశిల పార్కు వరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలంగాణ స్టేట్ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్ వరకు చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతోపాటు అన్ని సంఘాల బాధ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేయూ లైబ్రరీకి రైటింగ్ ప్యాడ్‌ల అందజేత

కేయూ క్యాంపస్: కేయూ పరిశోధకులు, విద్యార్థుల ఉపయోగార్థం కేయూ లైబ్రరీకి రూ.20 వేల విలువైన 100 రైటింగ్ ప్యాడ్‌లను హనుమకొండలోని శ్రీలక్ష్మి బుక్‌స్టాల్ యజమాని కొలగాని అభినవ్ శనివారం అందజేశారు. తన తండ్రి కొలగాని శ్రీనివాస్ జ్ఞాపకార్థం రైటింగ్ ప్యాడ్‌లను అందజేసినట్లు అభినవ్ తెలిపారు. ఈ సందర్భంగా అభినవ్‌ను లైబ్రరీ సిబ్బంది సన్మానించారు.

'తపాలా' పథకాలను వినియోగించుకోండి

శాయంపేట : తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆ శాఖ పరకాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామ్మూర్తి కోరారు. తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలపై మండల కేంద్రంలో శనివారం జరిగిన వారాంతపు సంతలో సిబ్బంది శనివారం విస్తృత ప్రచారం చేశారు. తౌలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి తైబజార్‌లో పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తపాలా శాఖ మహిళల అభ్యున్నతి కోసం 'మహిళా సమ్మాన్' సేవింగ్ సర్టిఫికెట్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. తపాలా శాఖ సేవలను, పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందాలని కోరారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య అధ్యక్షతన మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎస్‌ఓ వినయ్‌కుమార్, మెయిల్ సర్వర్, బీపీఎం, ఏబీపీఎం, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న తపాలా సిబ్బంది

ధ్వని కాలుష్యం నుంచి కాపాడాలి

శాయంపేట : తమ ఇంటి పక్కనే ఉన్న పవర్ లూమ్స్ నుంచి వస్తున్న ధ్వని కాలుష్యం నుంచి కాపాడాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన పురాణం రమేష్ కుటుంబంతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. పవర్ లూమ్స్ నుంచి వస్తున్న ధ్వని కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన వాపోయారు. జనావాసాల్లోంచి పవర్ లూమ్స్‌ను తొలగించాలని కోరారు. సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి హామీ ఇచ్చి ధర్నా విరమింపజేయించారు. గతంలో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని రమేష్ వాపోయాడు.



ధర్నా చేస్తున్న రమేష్ కుటుంబ సభ్యులు

భూసారం ఆధారంగా సాగు మేలు

శాయంపేట : భూసారం ఆధారంగా పంటలు సాగు చేస్తే మేలని మారి సంస్థ ప్రతినిధి షేక్ గౌస్ రైతులకు చెప్పారు. మండలంలోని జోగంపల్లి గ్రామంలో భూసార పరీక్షలపై రైతులకు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడారు. రైతుల వ్యవసాయ భూముల్లోని మట్టిని సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూసార ఫలితాల ఆధారంగా అనుకూలమైన పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు మనోహర్‌రావు, హిమబిందు, నవయుగ సొసైటీ డైరెక్టర్ లక్కం మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



మట్టిని సేకరిస్తున్న రైతులు, సంస్థ ప్రతినిధులు

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

● 80 ఫీట్ల నుంచి 60ఫీట్ల వరకు కుదింపు

హసన్‌పర్తి: భీమారం సెంటర్ నుంచి బొడ్రాయి వరకు రోడ్డు విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఏడాది క్రితం నిధులు విడులయ్యాయి. భీమారం సెంటర్ నుంచి చింతగట్టు రింగ్ రోడ్డు వరకు టెండర్ కూడా పూర్తయింది. అయితే, బొడ్రాయి నుంచి చింతగట్టు రింగ్‌రోడ్డు వరకు ఆరు నెలల క్రితమే పనులు పూరయ్యాయి.

అభ్యంతరాలతో నిలిచిన పనులు

రోడ్డు వెడల్పు విషయంలో స్థానికుల అభ్యంతరం మేరకు భీమారం సెంటర్‌నుంచి బొడ్రాయి వరకు పనులు నిలిచిపోయాయి. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కొత్త యాక్షన్ ప్లాన్ మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ఈ మేరకు మార్కింగ్ చేశారు. కొత్త ప్రణాళిక వల్ల ఇళ్లు కోల్పోతున్నామని ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఎదుట బాధితులు వాపోయారు.



ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు

పాత యాక్షన్ ప్లాన్ మేరకు..

కుడా పాత యాక్షన్ ప్లాన్ మేరకు 60ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు కార్పొరేటర్ జక్కుల రజిత తెలిపారు. రోడ్డుతో పాటు ఇరువైపులా మురుగునీటి కాల్వల నిర్మాణం చేపడతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ లక్ష్మణ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నాయకపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుమ్మ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలి



వాహన శ్రేణిని ప్రారంభిస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కాశిబుగ్గ: మంత్రి కేటీఆర్‌ను వెంటనే మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీలపై రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు చేపట్టిన నిరుద్యోగ మార్చ్‌కు పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, నిరుద్యోగులు పలు వాహనాల్లో తరలివెళ్లారు. ఈమేరకు వరంగల్ ఓ సిటీలోని తన నివాసం వద్ద జెండా ఊపి వాహన ర్యాలీని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ ప్రశ్న పత్రాలను లీక్ చేసి లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షలు రాసిన అభ్యర్థులకు నష్ట పరిహారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు వన్నాల వెంకటరమణ, శ్రీనివాస్ గౌడ్, చింత సాంబమూర్తి, అల్లం నాగరాజు, పిట్టల కిరణ్, కందిమల్ల మహేష్, మంతెన అమరీష్, మార్టిన్ లూథర్, ఉప్పల సురేందర్, మంద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హసన్‌పర్తి: జక్కుల రాధాకృష్ణ జ్ఞాపకార్థం భీమారంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీపీ దయాకర్ ముఖ్యఅతిథిగా హాజరై శనివారం ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్, ఎర్రగట్టు ఆలయ కమిటీ చైర్మన్ చింతల లక్ష్మణ్, నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

కాశిబుగ్గ: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉందని, ఈ క్రమంలో ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఫైర్ స్టేషన్ అధికారి శ్రీనివాస్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో శనివారం ఫైర్ మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూ ఫైర్ స్టేషన్‌కు సమాచారమివ్వాలని చెప్పారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మాక్‌డ్రిల్‌లో ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది రవీందర్, సురేందర్, చంద్రమౌళి, హరిబాబు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట ఫైర్ మాక్‌డ్రిల్

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



సమ్మె నోటీసులు అందజేస్తున్న కార్యదర్శులు

హన్మకొండ అర్బన్: నాలుగేళ్ల ప్రొబెషనరీ పీరియడ్ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకారపు సురేష్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్‌ను హనుమకొండ జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఈనెల 28వ తేదీన నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ సంతోష్, గిరిబాబు, వెంకటేశ్వర్లు, కిరణ్, వినయ్‌కిరణ్, సందీప్, శ్రీనివాస్, రవికుమార్, బుచ్చిరెడ్డి, నర్సింగం, రాజు, ప్రభ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ర్యాలీని విజయవంతం చేయాలి

విద్యారణ్యపురి : నేడు (ఆదివారం) నిర్వహించనున్న ఉద్యోగుల మార్చ్ (ర్యాలీ)ను విజయవంతం చేయాలని రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల యూనియన్ అధ్యక్షులు కందుల జీవన్‌కుమార్, రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కొండ శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ పిలుపు మేరకు ఈనెల 16న హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఎంజీఎం కూడలి నుంచి హనుమకొండలోని ఏకశిల పార్కు వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వెళ్లనున్నట్లు వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయడం ద్వారా సత్తా చాటాలని కోరారు.